
చంద్రబాబుకు పీలా, తాతయ్యబాబు కృతజ్ఞతలు

అనకాపల్లి పట్టణం, చోడవరం, న్యూస్‌టుడే: పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ఎంపికైన అనకాపల్లి జిల్లా



తెదేపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు బుధవారం మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రాష్ట్ర స్థాయిలో పదవులు ఇచ్చినందుకు పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టర పట్టు.. గోతిలోంచి బయటపడేట్టు



బీఎన్ రోడ్లో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో దారి పొడవునా పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. పాడేరు నుంచి కృష్ణదేవిపేటకు బెల్లం లోడుతో వెళ్తున్న వ్యాను రావికమతం మండలం కొత్తకోట సమీపంలో గోతిలో దిగి ఎక్కలేక ఆగిపోయింది. దాని బయటకు నెట్టేందుకు చాలాసేపు శ్రమించాల్సి వచ్చింది. –న్యూస్‌టుడే, రోలుగుంట (చోడవరం)

చెంతనే జలసిరి.. చేజారుతున్న ఊపిరి

ఈనాడు, పాడేరు, అనకాపల్లి, న్యూస్‌టుడే బృందం

» ఈ ఏడాది మే నెలలో పెదబయలు మండలం జామిగుడ వద్ద తారాజు జలపాతంలో దిగి అరకులోయ మండలానికి చెందిన వేణుగోపాల్ అనే యువకుడు చనిపోయాడు.

» నాలుగు రోజుల క్రితం మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్ద ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో అయిదుగురు వైద్య విద్యార్థులు గల్లంతయ్యారు. అందులో ఇద్దరు మాత్రమే స్థానికుల సహకారంతో ప్రాణాలతో బయటపడ్డారు. మరో ఇద్దరు చనిపోయారు. ఇంకొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

» ఇటీవల అనంతగిరి, దేవరాపల్లి మండలాల మధ్య సరియా జలపాతం వద్ద ఇద్దరు యువకులు స్నానాల కోసం దిగి లోతులోకి చిక్కుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

జాగ్రత్తలు మరిస్తే అవే జల సమాధులు

విహార యాత్రలు విషాదం కానివ్వొద్దు



ఎర్రవరంలోని జలపాతాల వద్ద స్నానాలు చేస్తున్న యువత (పాతచిత్రం)

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. నగరం, మైదానం, ఏజెన్సీ ప్రాంతాల్లో మిళితమై ఉండడంతో పర్యటకులు ఉమ్మడి జిల్లాను ఎక్కువగా ఇష్టపడుతుంటారు. సముద్ర తీరం, బౌద్ధారామం, మాటికొండ ప్రయాణం, ఎత్తైన కొండల నుంచి జాలువారే జలపాతాలు.. పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయి. అయితే ఈ ప్రకృతి అందాలు వెనుక ప్రమాదాలను పసిగట్టలేకపోతున్నారు. మద్యం మత్తు, సెల్ఫీల మోజు, రాకపోయినా నీళ్లల్లో ఈదాలన్న సరదాలతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా గంగపాలెలో జలపాతాల వద్ద జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ మంది చనిపోతున్నారు. గత ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను ఆదాయమార్గాలుగా చూసిందే తప్ప వాటి దగ్గర కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేసింది. కూటమి సర్కారు ఈ లోపాలను సరిదిద్ది విహార యాత్రలు విషాదం కాకుండా ఉండేలా స్వదేశీ దర్శన్‌లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించేలా చర్యలు చేపట్టబోతుంది.

అల్లూరి జిల్లాలో కొయ్యూరు మండలంలోని వల్లంపేట (గాదిగొమ్ము) జలపాతం వద్ద ప్రమాదవశాత్తు ఇప్పటివరకు సుమారు 48 మంది చనిపోయారు. అలాగే అనంతగిరి మండలం సరియా జలపాతంలో స్నానాల కోసం దిగి 24 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇక్కడ 60 అడుగుల లోతు ఉండడంతో తెలియక ఊబిలో చిక్కుకుపోతున్నారు. డుంబ్రిగుడ మండలం జలహిహరి వద్ద గతంలో ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకునేవి. సుమారు 28 మంది వరకు అక్కడ స్నానాలకు దిగి మృత్యువాతపడినట్లు చెబుతున్నారు. పర్యాటక సీజన్ వచ్చిందంటే చాలు ఏజెన్సీలో ఎక్కడో ఒకచోట జలపాతాల్లో ప్రమాదాల మాట వినిపిస్తూనే ఉంటున్నాయి. కొన్నిచోట్ల మాత్రమే ఐటీడీఏ, అటవీ శాఖల ఆధ్వర్యంలో కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం పేరుతో కొన్ని సదుపాయాలు కల్పించారు. చాలా జలపాతాల దగ్గర కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేకపోయారు.



సరియా జలపాతంలో ప్రమాదభరిత ప్రదేశం ఇదే..

ఇవీ కారణాలు..

» ఏ జలపాతమైనా ఎత్తైన కొండలపైనుంచి కిందికి జాలువారుతుంటుంది. కొండ ప్రాంతాల్లో వర్షపు నీరు వరదలా మారి.. ఒక్కోసారి పైనుంచి వచ్చేది కలిసి ఉప్పెనలా లోతట్టు ప్రాంతాలవైపు దూసుకువస్తుంటాయి. అలాంటి సమయాల్లో జలపాతాల వద్దకు వెళ్లడం అంత క్షేమం కాదు.

» ప్రమాదాలు జరగకుండా జలపాతాల వద్ద హెచ్చరికబోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి వదిలేయకుండా అక్కడ పర్యాటకులు హద్దుమీరితే వారిని నిలువరించేందుకు, ప్రమాదాలకు గురైతే రక్షించేందుకు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం వద్ద ఈ తరహా ఏర్పాట్లు ఉన్నాయి.



అతి ప్రమాదకరమైన పాములేరు



వల్లంపేట (గాదిగొమ్ము) జలపాతం

★ జలపాతాల వద్ద ఏకధాటిగా నీరు ప్రవహించడం వల్ల కింద ఉన్న బండ రాళ్లన్నీ నాచు పట్టి ఉంటున్నాయి. కొందరు యువకులు తలకు ఎలాంటి రక్షణ చర్యలూ లేకుండా ఆ రాళ్ల పైకెక్కి స్నానాలు, నృత్యాలు చేస్తున్నారు. స్వీయ చిత్రాల కోసం ప్రయత్నిస్తున్నారు. వీటి వల్లే ఒక్కోసారి కాలు జారి తలకు దెబ్బతగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదాల కట్టడికి ప్రత్యేక కమిటీ

ఏజెన్సీలో జలపాతాల వద్ద జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కమిటీ నియమిస్తాం. సబ్ కలెక్టర్, పోలీసు, అటవీ శాఖల అధికారులతో కూడిన ఈ కమిటీ మన్యంలో చిన్న, పెద్ద జలపాతాలు ఎక్కడెక్కడు న్నాయో గుర్తించి వాటిదగ్గర చేపట్టాల్సిన చర్యల గురించి సూచనలు చేస్తుంది. వర్షాలు ఎక్కువగా పడుతున్న సమయంలో పర్యాటకులు జలపాతాల దగ్గరకు వెళ్లకుండా అడ్డుకునేలా చర్యలు తీసుకుంటాం. ఐటీడీఏ నిర్వహించే జలపాతాల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

–అభిషేక్, ఐటీడీఏ, పీవో పాడేరు



తాండవలో ఒకరి గల్లంతు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాసాహెబ్‌పేటలో తాండవనది వద్ద వ్యక్తి గల్లంతయ్యారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యవరం గ్రామానికి చెందిన ఏసురు శివ మోహన్(25) తమ పొలాల సేద్యం పనుల నిమిత్తం మాసాహెబ్‌పేట సమీపంలోని కేశవరం వెళ్లాడు. తిరిగి వస్తూ తాండవ నదిపై తాత్కాలికంగా నిర్మించిన కాలిబాట వంతెనపై నడుస్తుండగా అదుపు తప్పి నదిలో పడి కొట్టుకుపోయాడు. సమీపంలోని రైతులు చూసి రక్షించేందుకు విఫలయత్నం చేశారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు సీఐ అప్పన్న తెలిపారు.



దివ్యాంగుల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు రుణాలు అందజేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల వ్యక్తుల స్వయం ఉపాధి పథకాల నిమిత్తం రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు ఈ రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నలభై, అంతకంటే ఎక్కువ వైకల్యం శాతం ధ్రువపత్రం ఉన్న 18 నుంచి 60 ఏళ్ల లోపు వయసు వారు దీనికి అర్హులన్నారు. ఈనెల 30వ తేదీలోగా అనకాపల్లి కలెక్టరేట్‌కు పోస్టు ద్వారా దరఖాస్తులు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 83741 48728 ఫోను నంబరులో సంప్రదించాలని కోరారు.

జిల్లా ఎస్పీగా తుహిన్ సిన్హా

దీపికకు కాకినాడ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఎస్పీగా **తుహిన్ సిన్హా**ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన నర్సీపట్నం ఏఎస్పీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న ఎం దీపికను కాకినాడలో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. విజయనగరం జిల్లాలో ఎస్పీగా పనిచేసిన ఈమె ఈ ఏడాది జులై 17న అనకాపల్లి ఎస్పీగా విధుల్లో చేరారు. రెండు నెలల్లోనే బదిలీ చేశారు. ఈమె భర్త కాకినాడ జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న నేపథ్యంలో అనకాపల్లిలో చేరినప్పటి నుంచి ఈమె కాకినాడకు బదిలీ చేయాలని అర్జీ పెట్టుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దీపికను తక్కువ సమయంలో బదిలీ చేసినట్లు తెలిసింది.

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాలకు గడువు పొడిగింపు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈనెల 28 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ఎం. వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. రూ. 200 అపరాధ రుసుంతో ఈనెల 30 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఉద్దండపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



సంఘటనా స్థలం

★ లారీని ఢీకొన్న బైకు: ఇద్దరు యువకుల దుర్మరణం ★ మరొకరికి తీవ్రగాయాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఉద్దండపురం వద్ద బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నక్కపల్లి సీఐ కె.కుమారస్వామి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



నాగేశ్వరరావు, నవీన్ (పాత చిత్రాలు)

నక్కపల్లి మండలం గొడిచెర్లకు చెందిన కిల్లాడ నాగేశ్వరరావు(24), ఆవాల నవీన్(18), దేవవరానికి చెందిన దమ్ము సీతయ్య ద్విచక్ర వాహనంపై వేంపాడు వద్ద ఓ దాబాలో టిఫిన్ చేసేందుకు వెళ్లారు. వీరు తిరిగి ఇంటికి బయలుదేరి వస్తుండగా, ఉద్దండపురం సమీపానికి చేరుకోగానే ముందు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు, నవీన్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. సీతయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న సీఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో తుని ప్రాంతీయాసుపత్రికి పంపించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనం నుజ్జయ్యింది. మృతదేహాలు, రక్తంతో సంఘటనా స్థలం భీతావహంగా మారింది. వీరంతా కూలి పని చేసుకుని జీవిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించడం అందరినీ కలచివేసింది. యువకుల మృతితో గొడిచెర్లలో విషాద ఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.



నుజ్జయిన బైకు



తీవ్రంగా గాయపడిన సీతయ్య

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తెలిపారు. అచ్యుతాపురం, దిబ్బపాలెం సెజ్ కాలనీలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో కలిపి ఈమె పర్యటించారు. దిబ్బపాలెం సెజ్ కాలనీలో క్రీడలకు అనుకూలమైన వాతావరణం, స్థలాలు అందుబాటులో ఉన్నాయని, సౌకర్యాలు కల్పిస్తే క్రీడాహబ్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు. దీనిపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురం కూడలి విస్తరణతో పాటు అప్పన్నపాలెం-సెజ్ రోడ్డు పనులన్నీ పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వీటితోపాటు ఎలమంచిలి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. ఆర్డీఓ చిన్నికృష్ణ, వీఎంఆర్డీయే, పంచాయతీరాజ్, ర.భ.శా. అధికారులు, నాయకులు బైలపూడి రాందాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జీ, కోరుపోలు చిన్నారావు, మోటూరు శ్రీవేణి, రాజాన విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సెజ్ కాలనీలో క్రీడా సౌకర్యాలపై పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ, ఎమ్మెల్యే సుందరపు

విజయవాడ వరద బాధితులకు రూ.25 లక్షల విరాళం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన విజయవాడ వరద బాధితులకు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌కు చెందిన టయోస్ రేర్ ఎర్త్స్ కంపెనీ ఉదారత చాటుకుంది. సీఎస్ఆర్ నిధుల కింద రూ. 25 లక్షల ఆర్థిక సహాయాన్ని బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్‌కు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయిచి సాటో చెక్కు అందించారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డా. బి.మురళీధరరావు, పరిశ్రమలశాఖ జీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

సాగునీటి వివాదం.. బంధువుల దాడి

భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు



వరలక్ష్మి పాత చిత్రం

గొలుగొండ, న్యూస్‌టుడే: సాగునీటి కోసం గొలుగొండ శివారు శ్రీరాంపురంలో దగ్గర బంధువుల మధ్య ఏర్పడిన వివాదం కత్తిపోట్లుకు దారి తీసింది. ఈ ఘటనలో భార్య మృతిచెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై రామారావు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. శ్రీరాంపురం గ్రామానికి చెందిన చిటెకెల తాతీయలు, రుత్తల అబ్బులు అలియాస్ రామకృష్ణ, వరలక్ష్మి దంపతులకు చెందిన భూములు పక్కపక్కనే ఉన్నాయి. ఎండ కాసినప్పుడు తన పొలంలోకి నీరు రాకుండా అడ్డుకట్ట వేయడం, భారీ వర్షం కురిస్తే కాలువ తీసి నీటిని వదిలేయడంతో పంట దెబ్బతింటోందని తాతీయలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి వద్ద ఇరు కుటుంబాల మధ్య ఇదే విషయంపై ఘర్షణ చోటుచేసుకుంది. అబ్బులు ముందుగా కత్తితో తనపై దాడి చేయడంతో, భయపడి ఆ కత్తిని లాక్కొని భార్యభర్తలపై ఎదురుదాడి చేసినట్లు తాతీయలు తెలిపారు. ఈ దాడిలో రామకృష్ణ, వరలక్ష్మి (45) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను నర్సీపట్నం తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండటంతో ఇద్దరినీ విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించామని, చికిత్సపొందుతూ వరలక్ష్మి మృతిచెందింది. సీఐ రేవతమ్మ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధునాతన వైద్యం అందుబాటులోకొచ్చేలా..


క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణ పనులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లాకేంద్రంగా ఏర్పడినా.. జిల్లా ఆసుపత్రి అందుబాటులో ఉన్నా.. రోగికి క్రిటికల్ వైద్యం అవసరమైతే కేజీహెచ్‌కు పంపడం ఆనవాయితీగా మారింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 22 కోట్లతో అనకాపల్లిలో క్రిటికల్ కేర్ బ్లాక్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించినా ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత వీటి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి నిర్మాణ పనులపై చర్చించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జనవరి కల్లా భవనాన్ని పూర్తి చేయడానికి వీలుగా పనులను ముమ్మరం చేశారు.

అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రూ. 22 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను మూడు అంతస్థుల్లో నిర్మిస్తున్నారు. 50 పడకల సామర్థ్యంతో నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మూడు అంతస్థుల భవనంలో ట్రామా కేర్, డయాలసిస్ సెంటర్లు, మాతా శిశువులకు అత్యవసర వైద్యంతో పాటు హెచ్‌డీయూ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. చికిత్సలకు అవసరమైన పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటారు. డయాలసిస్ సెంటర్ అనకాపల్లిలో లేకపోవడంతో కేజీహెచ్‌కు గానీ, నర్సీపట్నం ఆసుపత్రికి గానీ వెళ్లాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను అధిగమించి రోగికి ఇక్కడే పూర్తిస్థాయి వైద్యం లభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మాతా శిశువులకు సంబంధించి అత్యవసర వైద్యం అందించి ప్రాణాలను కాపాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు. హై రిస్క్‌లో ఉండే గర్భిణులకు అధునాతన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. పాయకరావుపేట వరకు విస్తరించిన జాతీయ రహదారితో పాటుగా రాష్ట్ర రహదారి అధికంగా ఉంది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ట్రామా కేర్ సెంటర్ కావాలని ఎంతో కాలంగా కోరుతున్నా సాధ్యంకాలేదు.

రోగులకు ఇబ్బందులు తీరుతాయి



అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనులు వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తవుతాయి. ఇది అందుబాటులోకి వస్తే డయాలసిస్, ట్రామాకేర్ సెంటర్, ఎంసీహెచ్, హెచ్‌డీయూ బ్లాక్‌లను మూడు అంతస్థుల్లో ఏర్పాటుచేసి రోగులకు సేవలు అందిస్తాం. కేటాయించిన రూ. 22 కోట్లలో రూ.7 కోట్ల పరికరాల కొనుగోలుకు వినియోగిస్తారు. క్రిటికల్ వైద్యం అందుబాటులోకి వస్తే రోగులకు ఇబ్బందులు తప్పుతాయి.

– డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

ముఖాముఖి

రూ. కోటి జీతం... అయినా వద్దనుకున్నా!!

ఈనాడు, విశాఖపట్నం



జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి సవాళ్లను అధిగమించాలి. ఈ క్రమంలో 'రిస్క్' కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా సివిల్స్ సాధన చేసేవారికి ఒక రకమైన మొండి పట్టుదల ఉండాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చు. ఉన్నంతలో సర్దుకుపోదాం అంటే ఎప్పటికీ మన కలలను నిజం చేసుకోలేం' అని ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వితేజ్ చెబుతున్నారు.

రిస్క్ తీసుకొని సివిల్స్ వైపు వచ్చా

రోజుకు 14 గంటలు కష్టపడ్డా.. ఫలితంగానే 24వ ర్యాంకు

శ్రద్ధ చూపితే మొదటి ప్రయత్నంలోనే విజయం సాధ్యం

'ఈనాడు'తో ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్

ఈ యువ ఐఏఎస్ అధికారి సమయం చిక్కినప్పుడల్లా 'కెరీర్ గైడెన్స్' కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేలా 'హ్యాక్ ఏపీ హ్యాక్‌థాన్' కార్యక్రమాన్ని చేపట్టారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'అదర్ కెరీర్ ఆప్షన్స్' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వచ్చాయి. మరిన్ని రాబోతున్నాయి. ప్రతి ఒక్కరూ కఠోర దీక్షగా శ్రమిస్తే ఆశించిన ఫలితం అందుకోవచ్చంటున్న పృథ్వితేజ్... తాను ఐఏఎస్ సాధించిన తీరు, స్వీయ అనుభవాలను 'ఈనాడు'తో పంచుకున్నారు.

విద్యార్థి దశ నుంచే బలమైన కోరిక: 'మాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ద్వారకా తిరుమల గ్రామం. మా నాన్న మొదట్లో కిరాణా దుకాణం నిర్వహించేవారు. తర్వాత చిన్న బంగారు ఆభరణాల దుకాణం నడుపుతున్నారు. నేను ఆరో తరగతి వరకు స్థానికంగానే చదువుకున్నా. ఏడో తరగతి నుంచి పదోతరగతి వరకు గుడివాడలో స్కూల్ హాస్టల్‌లో ఉండే చదువుకున్నా. అప్పుడే నాలో ఐఏఎస్ అవ్వాలనే కోరిక కలిగింది. 2011లో ఐఐటీ ప్రవేశ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినప్పుడు ఆ కోరిక మరింత బలపడింది.

● ముంబై ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. 2014 ప్రాంగణ ఎంపికల్లో సామ్‌సంగ్ కంపెనీలో ఉన్నత కొలువే దక్కింది. దక్షిణ కొరియాలో ఏడాదిపైగా ఉద్యోగం చేశాను. వార్షిక వేతనం రూ.కోటి పైనే. అయినా నాకు అది పెద్ద సంతృప్తినివ్వలేదు. సివిల్స్ పైనే మనసు ఉండిపోవడంతో ఇండియాకు వచ్చి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించగలిగా. చిత్తూరులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నాక కడపలో సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ ఇచ్చారు. తర్వాత ట్రాన్స్‌కోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం ఈపీడీసీఎల్ సీఎండీగా పనిచేస్తూ సంస్థను అగ్రస్థానంలో నిలపడానికి కృషిచేస్తున్నా.

పెద్ద బహుమతే దక్కింది..



ఇంజినీరింగ్ తర్వాత రూ.కోటి వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాన్ని వదులుకుని సివిల్స్ వైపు రావాలనుకోవడం కొంచెం రిస్కే. అయినా నా లక్ష్యం ముందు అది చిన్నదిగానే అనిపించింది. అమ్మ, నాన్న కూడా నన్ను ప్రోత్సహించారు. 2016 చివర్లో దక్షిణ కొరియా నుంచి దిల్లీ వచ్చాను. అప్పటికే శిక్షణ సంస్థల్లో కోర్సులు చివరికి వచ్చేశాయి. దీంతో కేవలం మూడు నెలలు మాత్రమే క్రాష్ కోర్సు శిక్షణ తీసుకున్నాను. నాకు ఇష్టమైన గణితాన్నే ఐచ్ఛికంగా ఎంచుకుని సొంతంగా సాధన చేశా. పాత పేపర్లతో పాటు సీనియర్ల సూచనలు తీసుకుని రోజుకు 14 గంటలు పాటు చదివి తొలి ప్రయత్నంలోనే 24వ ర్యాంకు సాధించడంతో పడ్డ కష్టం, చేసిన రిస్క్‌కు పెద్ద బహుమతే దక్కింది.

ఏకాగ్రతతో చదవాలి..

జనరల్ కేటగిరీలో సివిల్స్ రాయడానికి ఆరు సార్లు అవకాశం ఉంటుంది. అన్ని అవకాశాలున్నాయి కదా.. ఏదో ఒక ఏడాది పోస్టు కొట్టొచ్చు అనేలా సాధన చేయకూడదు. ఒకటి, రెండు ప్రయత్నాల్లోనే కొలువు సాధించేలా ఏకాగ్రతతో చదువుతుండాలి. నోటిఫికేషన్ వచ్చినప్పుడు మూడు గంటలు చదువుదాం.. పరీక్ష దగ్గర పడుతున్నప్పుడు పది గంటలు చదివేద్దాం అంటే కుదరదు. మనం ఏ ఉద్యోగమైతే కొట్టాలనుకుంటున్నామో దానికి సంబంధించిన సబ్జెక్టులను తొలి రోజు నుంచే కనీసం 10 నుంచి 12 గంటలు సాధన చేస్తేనే విజయం సాధించడానికి అవకాశం ఉంటుంది. నేను ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు ఇదే చెబుతుంటా. కష్టే.. ఫలి అనే సూత్రాన్ని నమ్ముతుంటా. సివిల్స్ అనే కాదు...గ్రూప్స్, ఇతరత్రా ఏ పోటీ పరీక్షలకైనా ఇదే వర్తిస్తుంది.

ప్రమాద స్థాయికి తాండవ నీటిమట్టం

స్వల్పంగా దెబ్బతిన్న రావణాపల్లి కాలువ గట్టు

నర్సీపట్నం గ్రామీణం, నాతవరం, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా ఎగువ నుంచి వాననీటి ప్రవాహాలు వచ్చి చేరుతుండడంతో తాండవ జలాశయం మళ్లీ ప్రమాద స్థాయికి చేరుకుంది. దీని గరిష్ఠస్థాయి నీటిమట్టం 380 అడుగులు, బుధవారానికి 378.8 అడుగులకు చేరుకుంది. 1500 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా మధ్యాహ్నం రెండు గేట్లను ఎత్తివేసి నదికి 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో తాండవ నదిలో ఒక్కసారిగా ఉద్ధృతి పెరిగింది. కుడి, ఎడమ కాలువలకు 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలో 4.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రావణాపల్లి జలాశయం గరిష్ఠస్థాయికి మించిపోయింది. అదనపు నీరు పొర్లుకట్ట మీదుగా గెడ్డలోకి ప్రవహిస్తోంది. చెట్టుపల్లి కాలువ పైనుంచి నీరు ప్రవహిస్తోంది. పొలాల్లోని వర్షపునీరు శివపురం ప్రాంతంలోని రోడ్డును ముంచెత్తింది. మంగళవారం రాత్రి గొలుగొండలో అత్యధికంగా 120, నర్సీపట్నంలో 80.4, నాతవరంలో 38.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


శివపురం ప్రాంతంలో రోడ్డును ముంచెత్తిన వర్షపునీరు


చెట్టుపల్లి సమీపంలో రావణాపల్లి జలాశయ కాలువ మించి వాన నీటి ప్రవాహం

జలాశయాల నీటి విడుదల


కోనాం జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

చీడికాడ, దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కోనాం జలాశయంలోకి వరదనీరు పోటెత్తింది. ఎగువ ప్రాంతం నుంచి 1000 క్యూసెక్కులకు పైగా వరద నీరొచ్చి చేరింది. దీంతో జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 100 మీటర్లకు చేరింది. 180 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంత గెడ్డల నుంచి వరద నీరు భారీగా చేరడంతో నీటిమట్టం క్రమేపీ పెరుగుతుందని.. ఏ క్షణంలోనైనా జలాశయం నుంచి దిగువ బొడ్డేరు నదిలోకి వరదనీటిని విడుదల చేసే అవకాశం ఉందని ఏఈ జయరామ్ ప్రకటించారు. రైవాడ జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా బుధవారం సాయంత్రానికి 113.25 మీటర్లకు చేరుకుంది. మరో 0.25 మీటర్ల నీరు చేరితే గేట్ల ద్వారా నీటిని శారదానదిలోకి విడిచిపెడతామని జలాశయ డీఈఈ సత్యంనాయుడు స్పష్టం చేశారు. మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో జలాశయంలోకి సుమారు 1000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. మంగళవారం రాత్రి 6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ నదిలోకి దిగొద్దని సూచించారు.

పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు..

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయ నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 136.50 మీటర్లు చేరిందని పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. వర్షాలు కారణంగా జలాశయానికి సుమారు 250 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. బుధవారం రాత్రికి సుమారు 300 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా విడుదల చేస్తున్నట్లు ఆయన చెప్పారు.


రైవాడ జలాశయ తాజా నీటిమట్టం

కల్యాణపులోవ నుంచి..

రావికమతం, న్యూస్‌టుడే: కల్యాణపులోవ జలాశయం నీటి మట్టం బుధవారం నాటికి 458.80 అడుగులకు చేరింది. పరీవాహక ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో 50 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చి చేరుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా రెండు గేట్లు ఎత్తి దిగువ సర్పానదిలోకి నీటిని వదులుతున్నట్లు జలాశయం పర్యవేక్షణాధికారి సత్యనారాయణ దొర చెప్పారు.

శారదానది ఉద్ధృతి

కశింకోట, కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఎడతెరిపి లేని వర్షాలతో శారదానది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రాత్రి భారీ వర్షం పడింది. ఈ కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నది ఒడ్డున ఉన్న ఉమా రామలింగేశ్వరాలయం, వినాయక ఘాట్ మెట్ల మీదుగా నీరు ప్రవహిస్తోంది. కొత్తూరు పంచాయతీ సాయినగర్ కోనేరులా మారింది. కొత్తూరు ప్రధాన మార్గంతో పాటు నాలుగో వీధి, ఆరో వీధిలో వర్షపు నీరు చేరింది. కొంకిటలలో త్రిపురాంతకస్వామి, శ్రీవరాహలక్ష్మీ నరసింహస్వామి గర్భాలయాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రెండు దేవాలయాల గర్భాలయాల్లోకి నీరు చేరింది. శివలింగం మునిగిపోయింది. బుధవారం ఉదయం మోటార్లతో నీటిని తోడించారు.


నీట మునిగిన కొత్తూరు సాయినగర్ కాలనీలోని రహదారులు

హత్యాయత్నం కేసులో అయిదేళ్ల జైలు శిక్ష

చోడవరం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితుడికి అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ చోడవరం అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు వెలువరించింది. బంగారుమెట్ట గ్రామానికి చెందిన ముత్యాల నూకరాజును అదే గ్రామానికి చెందిన ఆయన అల్లుడు సింగంపల్లి రాము 2021 జులై 29న కత్తితో మెడపై పొడిచి గాయపరిచాడు. దీనిపై నూకరాజు బుచ్చెయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి చోడవరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత సీనియర్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్రబాబు తీర్పు వెల్లడించారు. జరిమానా కట్టని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, గాయపడిన వ్యక్తికి రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారని బుచ్చెయ్యపేట ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్రావు కోర్టులో వాదనలు వినిపించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి నిందితులకు శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి ఎస్సై రామకృష్ణ, బుచ్చెయ్యపేట పోలీసులు, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని ఎస్పీ దీపిక అభినందించారు.

ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ

ఈనాడు, అనకాపల్లి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సెజ్‌లో పెను విధ్వంసాన్ని సృష్టించి 17 మందికి మృతి కారణమైన ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై ఉన్నతస్థాయి కమిటీ గురువారం విచారణకు రానుంది. ఈ పరిశ్రమను పరిశీలించడంతో పాటు ప్రమాదానికి గల కారణాల విశ్లేషణ, భవిష్యత్తు చర్యలపై సమగ్రమైన నివేదిక తయారీకి నిపుణులతో కలిసి కమిటీ ప్రతినిధులు రానున్నారు. విశ్రాంతి ఐఏఎస్ అధికారిణి వసుధమిశ్ర ఛైర్‌పర్సన్‌గా ఉండే ఈ కమిటీలో పర్యావరణశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, లేబర్, బాయిలర్స్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసు కార్యదర్శి, పరిశ్రమలశాఖ కార్యదర్శి, సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్, అగ్నిమాపక దళం డీజీ, పీసీబీ మెంబర్ సెక్రటరీ, బయలర్స్ డైరెక్టర్, పరిశ్రమలశాఖ డైరెక్టర్, ఏపీఐఐసీ వైస్‌ఛైర్మన్, ఎండీతో కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి పరిశ్రమలశాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. శ్రీసిటీ, పరవాడ ఫార్మాసిటీ, బల్క్‌డ్రగ్ మేనుఫాక్చర్ అసోసియేషన్, బ్రాండిక్స్, ఏపీఐఐసీ సెజ్ నాయుడుపేట, అచ్యుతాపురం, ఐఐటీ చెన్నై, తిరుపతి, ఎన్ఐటీఐ అయోగ్యా నుంచి పరిశ్రమల భద్రతకు సంబంధించిన నిపుణులు ఈ కమిటీలో ఉన్నారు.

ప్రధానోపాధ్యాయుడు సహా ఇద్దరికి తాఖీదులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడు సహా ముగ్గురికి డీఈఓ వెంకటలక్ష్మమ్మ తాఖీదులు జారీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం మధ్యాహ్నం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాత పుస్తకాలను భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు శంకర్ జులై నుంచి సరిదిద్దకపోవడాన్ని గుర్తించారు. పాఠశాలలో పరిశుభ్రత లేకపోవడంతో ఆయా కుమారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రధానోపాధ్యాయుడు జాన్‌ప్రసాద్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురికి బుధవారం రాత్రి తాఖీదులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఎంఈఓలు కె.ఎన్. గాంధీ, రమేష్‌బాబు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈవో

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏసీగా సుధాకర్‌రెడ్డి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎస్ఈబీ ఏసీగా హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్నారు. ఇతన్ని అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. www.bse.ap.in వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఎస్‌బీఐ రశీదును అక్టోబర్ 14 లోగా తమ కార్యాలయంలో అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో వడ్డాది విద్యార్థి ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో వడ్డాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన గోడ చరణ్ రజత పథకాన్ని సాధించాడు. ఈనెల 22, 23 తేదీల్లో జరిగిన అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో వడ్డాది పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బాలుర 40 కేజీల విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న చరణ్ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. పతకం సాధించిన విద్యార్థిని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు, విద్యాకమిటీ ఛైర్మన్ కోవెల వెంకటరమణ, పీడీ నర్సింగరావు అభినందించారు.

కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలో ఇద్దరు మహిళలకు డెంగీ

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తకోట, పి.పొన్నవోలు గ్రామాల్లో ఇద్దరు మహిళలు డెంగీ బారినపడ్డారు. కొత్తకోట పెద్ద సోపావీధికి చెందిన గృహిణి కలం రమణమ్మకు మూడు రోజుల క్రితం డెంగీ సోకింది. తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పి.పొన్నవోలులోని గంగుపాము వరలక్ష్మి (38) డెంగీ బారినపడడంతో ఆమెను ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. జ్వరం తగ్గడంతో ఇరువురు ఇంటికి చేరుకున్నారు. మహిళలకు డెంగీ సోకిన విషయం తెలియడంతో కొత్తకోట పీహెచ్‌సీ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం పెద్ద సోపావీధిలోని రమణమ్మ ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. పలువురికి రక్త నమూనాలు సేకరించారు. డ్రైనేజీల్లో యాంటీ లార్వా నివారణకు మందును పిచికారీ చేయించారు. ఇంటి పరిసరాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రజని సూచించారు. పంచాయతీ అధికారులకు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెప్పారు. రమణమ్మను సర్పంచి కోన లోవరాజు, నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి పరామర్శించారు. పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు పర్యవేక్షణలో పి.పొన్నవోలులో వరలక్ష్మి ఇంటి పరిసరాల్లోనూ దోమల మందును పిచికారీ చేయించారు. కొత్తకోట, పి.పొన్నవోలులో ప్రస్తుతం డెంగీ అదుపులోనే ఉందని, ఇద్దరికి తప్ప మరెవరికీ డెంగీ సోకలేదని డాక్టర్ రజని తెలిపారు.


కొత్తకోట పెద్ద సోపావీధిని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

క్రీడారంగ అభివృద్ధికి ప్రోత్సాహం

మునగపాక, న్యూస్‌టుడే: క్రీడారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోదరుడు రవికుమార్ అన్నారు. మునగపాక నందీశ్వర ప్రాంగణంలో మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల నుంచి మహిళా జట్లు పాల్గొన్నాయి. ప్రారంభంలో గుంటూరు-కృష్ణ జిల్లాల జట్ల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు, మండల జనసేన అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, సర్పంచి దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వేగి కృష్ణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు పాల్గొన్నారు.


కృష్ణ- గుంటూరు జట్ల మధ్య హోరాహోరీ పోరు

ఏఐఏడీఆర్ పోటీల్లో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థుల సత్తా


వినీల, అంకితలను అభినందిస్తున్న ఉపకులపతి సూర్యప్రకాశరావు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్(ఏఐఏడీఆర్) నిర్వహించిన 2వ అంతర్జాతీయ మీడియేషన్ కాంపిటీషన్-2024 పోటీల్లో దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన పోటీల్లో నాలుగో సంవత్సరం విద్యార్థులు కొత్తపల్లి వినీల, వర్ణిక అంకిత విజేతలుగా నిలిచినట్లు ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు తెలిపారు. బుధవారం వీరిని వీసీ అభినందించారు.

రూ. 7.5 కోట్లతో బొజ్జన్నకొండలో అభివృద్ధి పనులు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం శంకరం బొజ్జన్నకొండ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో రూ.7.5 కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ పనులను బుధవారం అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని పర్యాటక శాఖ ఈఈ రమణ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ డీపీఎంపై విచారణకు డిమాండ్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఇతనిపై చర్యలు తీసుకోవాలని సిబ్బంది డిమాండ్ చేశారు. అనకాపల్లి మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు బి.దేవి, ఎలమంచిలి తెదేపా నాయకుడు నాగేశ్వరావుతో కలిసి సిబ్బంది బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా ఉద్యోగుల పట్ల ఈయన వ్యవహారశైలి బాగోలేదని, ఆయనకు అనుకూలంగా లేని ఉద్యోగులను విధులను తొలగించడం, సరెండర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **గొర్రె పురాణం** రామచంద్ర: **హైడ్ ఎన్ సీక్** సత్యనారాయణ స్క్రీన్-1: **ఏఆర్ఎం 3డీ** స్క్రీన్-2 : **మత్తు వదలరా 2** వెంకటేశ్వర: **చిక్లెట్స్** పర్తిసాయి: **అయ్,** షిర్డిసాయి: **సరిపోదా శనివారం** శ్రీ సత్య: **మన్యం ధీరుడు సీతారామరాజు**
అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినిమా స్క్రీన్-1: **మత్తు వదలరా 2,** స్క్రీన్-2: **డిమోంటి కాలనీ -2**

27, 28 తేదీల్లో నియోజకవర్గస్థాయి పోటీలు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నియోజకవర్గస్థాయి అండర్ 14, 17 ఆటల పోటీలు ఈనెల 27, 28 తేదీల్లో ఎస్.నర్సాపురం ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతాయని నిర్వాహకులు రవికుమార్ తెలిపారు. బాలబాలికలు నిర్వహించే ఈ పోటీల్లో వాలీబాల్, ఖోఖో, చెస్, యోగా, బ్యాట్‌బాల్ క్రీడలు జరుగుతాయని వివరించారు. ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

కల్వర్టు శిథిలం.. రాకపోకలు ప్రమాదకరం

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేటకు వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టుకు రంధ్రం పడింది. రాజయ్యపేటకు సమీపాన ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు కాస్త కుంగిపోతోంది. ఈ ప్రాంతంలో గంత లుపుంది. ఇక్కడ ఓ కల్వర్టు ఉంది. రోజూ ఈ మార్గంలో అనేక వాహనాలు పరుగులు తీస్తుంటాయి. రోడ్డు మధ్యలో రంధ్రం పడటంతో చిన్న వాహనాలు తప్పితే పెద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. స్థానిక మత్స్యకార నాయకులు ఈ విషయాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు బుధవారం తెలియపరిచారు. వాహన రాకపోకలు సాగించే వారు ప్రమాదాన్ని గుర్తించడానికి వీలుగా ఇందులో చెట్టు కొమ్మలు పెట్టారు. శిథిలావస్థ త్వరగా దీనికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దెబ్బతిన్న కల్వర్టును చూపుతున్న నాయకులు

ఛిద్రమైన రహదారులు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: భారీ వర్షాలకు పట్టణంలో రహదారులు ఛిద్రమై చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా రైల్వేస్టేషన్, జలగలమదుం కూడళ్లలో రహదారులు దయనీయంగా మారాయి. గుంతల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వీటిలో వాహనాలు ఒరిగిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రహదారులకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




జలగల మదుం సమీపాన గుంతలో ఒరిగిన లారీ

అభివృద్ధి, సంక్షేమాలపై సర్వే

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

వికసిత్ భారత్-2047కు ప్రణాళిక సిద్ధం చేస్తున్న నేపథ్యంలో స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం విడుదలకు సీఎం చంద్రబాబునాయుడు చొరవ చూపుతున్నారు. దీంట్లో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు ప్రశ్నలు ఇచ్చి వారి నుంచి వచ్చే సమాధానాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు.

పథకాలతో పాటు ఏం చేస్తే బాగుంటుందనే అంశాలపై ప్రజల సలహాలు తీసుకుని వాటిని పొందుపరుస్తున్నారు. ఈ నెల 30 లోగా కార్యక్రమాన్ని పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలు జారీచేయడంతో సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాల ఆర్పీలు, సీఓలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్వర్ణాంధ్ర 2047పై ప్రజల ఆలోచనలు, సలహాలను ప్రశ్నావళి రూపంలో కోరుతూ సమాధానాలు పొందుపరుస్తున్నారు. అనకాపల్లి జీవీఎంసీ జోన్‌లో 30,311 ఇళ్లు ఉన్నాయి. ఐదు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌లో సమాధానాలు రాబడుతున్నారు. అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలతో పాటు పురోభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై ప్రశ్నలతో సమాధానాన్ని ప్రజల నుంచి సేకరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసి సంపద సృష్టి, సుస్థిర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, పేదరికం లేని సమాజ స్థాపనకు స్వర్ణాంధ్ర 2047లో ఏం చేయాలనేది ప్రజలు కోరుకుంటున్నారో వివరాలు సేకరిస్తున్నారు. స్థానికంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అభివృద్ధికి వివరాలు సేకరిస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలు పెంచి మెరుగైన ఉపాధి అవకాశాలు లభించే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నారు. సర్వేలో స్పందించిన వారికి పేర్లు, వయస్సు, సెల్‌ఫోన్ నంబరు, జిల్లా, వృత్తి తెలుసుకుంటున్నారు. తదుపరి వచ్చిన ప్రశ్నావళిలో ఒక్కో ప్రశ్నకు సంబంధించిన అంశాల్లో ఏది అవసరమని భావిస్తున్నారో వాటిని తెలియజేయాలి. ఆర్థిక అభివృద్ధికి కీలక రంగాలు, జీవన ప్రమాణాలు, సుస్థిరత, పర్యావరణ అభివృద్ధి, భవిష్యత్ నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు, పాలన మెరుగు, మహిళా సాధికారత, రైతులు, బలహీన వర్గాల ఆకాంక్షలు వంటి 11 అంశాలు ఉన్నాయి.





అనకాపల్లిలో ఇంటింటా సర్వే

అభిప్రాయాల సేకరణ



డ్వాక్రా సంఘాల ఆర్పీలు, సచివాలయ సిబ్బందితో సర్వే చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ ద్వారా సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్నాం. వ్యక్తిగత అభిప్రాయాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ప్రజలు ఏం కోరుకుంటున్నారు. అభివృద్ధి సంక్షేమానికి చేపట్టాల్సిన పనులతో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా చేయాల్సిన పనులపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాం. – ధార, యూసీడీ పీడీ

ప్రాయశ్చిత్త దీక్ష విరమణ

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానంలోని లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేయడంపై గత మూడురోజులుగా ప్రాయశ్చిత్త దీక్షలు చేపట్టారు. చివరి రోజు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షలో నియోజకవర్గం నుంచి భారీగా కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు భీమరశెట్టి రామకృష్ణ దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం తాగించి విరమింపజేశారు.



నిమ్మరసం తాగిస్తున్న రామకృష్ణ

అ వీ ఇ వీ

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయండి

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎల్. కిశోర్, ఉపాధ్యక్షులు బాల మురళి తదితరులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభం ఏర్పాటుకు విరాళం

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి): ఉడేరు రామాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు బుధవారం సర్పంచి సిరిగిరి శెట్టి కృష్ణమోహన్ రూ.15,999 విరాళం అందించారు. ఉపసర్పంచి బి.రాజు, వార్డు మెంబర్ కల్యాణ్ రూ.5116 చొప్పున ఇచ్చారు.

వార్డెన్‌పై చర్యలకు వినతి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేట ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల వసతిగృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాలు కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేసి డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో వార్డెన్ రాజ్‌కుమార్ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. గణేష్, గోపి, జగదీష్, చిన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీవాసుల సంఘం ఏర్పాటు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: సత్యనారాయణపురం టిడ్కో గృహ సముదాయం నివాసుల సంక్షేమ సంఘం ఏర్పాటైంది. కమిటీ అధ్యక్షులుగా హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా పెంటకోట శ్రీను, కార్యదర్శిగా పెంటకోట ప్రసాద్, ఉపాధ్యక్షుడుగా విల్లూరి సత్తిబాబు తదితరులను ఎన్నుకున్నారు.

తెదేపా నేత మృతికి నివాళి

నక్కపల్లి: ముకుందరాజుపేటకు చెందిన తెదేపా నాయకుడు నందిక చినఅప్పారావు అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి తదితరులు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మంత్రి అనిత హామీ ఇచ్చారన్నారు.

దివ్యాంగులకు బస్ పాసుల జారీ

రాంబిల్లి, న్యూస్‌టుడే: కొత్తూరులో బుధవారం ఆర్టీసీ ప్రత్యేక శిబిరంలో 50 మంది దివ్యాంగులకు బస్సుపాసులు జారీ చేశారు. కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో మేనేజరు గౌతమ్ ఛటర్జీ, సహాయ మేనేజరు పి.శ్రీనివాసరావు పాసులు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఆయన చేతులమీదుగా పాసులను దివ్యాంగులకు అందజేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

రాంబిల్లి, న్యూస్‌టుడే: తహసీల్దారుగా ఎ.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి కలెక్టరేట్‌లో ఏఓగా ఉన్న ఆయన్ని ఇక్కడకు బదిలీ చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

మునగపాక: అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలు సకాలంలో పూర్తిచేయించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి సూచించారు. మునగపాకలో బుధవారం గృహ నిర్మాణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ మంజులవాణి, ఇన్‌ఛార్జి ఎంపీడీఓ ప్రసాదు, ఏఈ రాము పాల్గొన్నారు.

పాత భవనాల్లోకి ప్రభుత్వ ఆసుపత్రిని మార్చాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: తులసీనగర్‌లో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రికి రావడానికి సరైన రవాణా సౌకర్యం లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని, పాత భవనాల్లోకి మార్చాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కలెక్టర్ విజయకృష్ణన్‌ను కోరారు. బుధవారం కలెక్టర్‌తో కలిసి ఆయన ఎలమంచిలిలో పర్యటించారు. వైద్యులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. పక్కనే ఉన్న జగనన్న కాలనీ చూశారు. జగనన్న కాలనీ అంతా దగాలకులుగా ఉందని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నేరుగా పాత ఆసుపత్రి భవనాలు పరిశీలించారు. పురాతన కోర్టు భవనాలు పరిశీలించి శిథిలావస్థకు చేరుకున్న వీటిని తొలగించి కొత్తవి నిర్మించాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. కోర్టు సముదాయంలో న్యాయవాదులతో కలెక్టర్ మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులతో పురాతన భవనానికి మరమ్మతులు చేయిస్తానని విజయకుమార్ చెప్పారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని ముదుగంట పంటకాలువ ద్వారా పెందుర్తిలో కలుస్తోందని ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రాంతం పరిశీలించిన ఆమె నీటిని శుద్ధి చేసి చెరువులోకి పంపేలా చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుతో మాట్లాడారు. ఆర్డీవో చిన్నికృష్ణ, నాయకులు బొద్దపు శ్రీను, గొర్లెనాయుడు, కరణం రవికుమార్, కొరాడ సాంబ, గుర్రాల శేఖర్, పల్లా సత్యనారాయణ, లాలం సోమినాయుడు, అన్నం బాబ్జీ, లల్లు లోవరాజు పాల్గొన్నారు.



న్యాయవాదులు, అధికారులతో కలెక్టర్, ఎమ్మెల్యే

సైన్స్ సంబరాలు ప్రారంభం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా బుధవారం అచ్యుతాపురం కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాతెట్టి వెంకటఅప్పారావు, పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవి, యూటీఎఫ్ నాయకులు మద్దిల నానాజీ, సూర్యప్రకాశ్, కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. 1500మంది విద్యార్థులు ఈపరీక్షకు హాజరయ్యారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వందరోజుల పాలనలో ప్రజలకు మేలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వందరోజుల వ్యవధిలో ప్రజలకు ఎంతో మేలు చేకూర్చేలా సీఎం చంద్రబాబునాయుడు పాలన అందించారని మాజీ ఎమ్మెల్యే బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. అనకాపల్లిలోని సాంబమూర్తి కోవెల ప్రాంతంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు ఉపాధి అందించేలా 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో వైకాపా నాయకుల తీరును నిరసిస్తూ 81వ వార్డులో చేపట్టిన శ్రీవారి భక్తుల నిరసన కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ మురళి పాల్గొన్నారు.



గోడకు స్టిక్కర్ అంటిస్తున్న బుద్ద

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేటలోని సచివాలయం-3 పరిధిలో ఇంటింటికీ తెదేపా నాయకులు కరపత్రాలు పంచారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వివరించారు. నాయకులు గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, వి.వెంకటరమణ, నారపురెడ్డి పద్మ, మలిపెద్ది వెంకటరమణ రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

రాంబిల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సభ్యులు కోరారు. ఎంపీపీ గొట్టిముక్కల శిరీష అధ్యక్షతన బుధవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యల్లో పరిష్కరించిన వాటిపై సీనియర్ సహాయకులు బిగిలీ వివరించారు. గృహనిర్మాణ ఏఈ ఎం.అనిల్‌కుమార్ మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో నిర్మాణాలు పూర్తై బిల్లులు అందని 802 ఇళ్లను సర్వేలో గుర్తించినట్లు చెప్పారు. భూముల రీసర్వేలో లోపాలను సరిచేయాలని వైస్ఎంపీపీ కొటాపు లక్ష్మి కోరారు. పలు శాఖల అధికారులు తమ నివేదికలను సభలో చదివి వినిపించారు. జడ్పీటీసీ సభ్యుడు దూళి నాగరాజు, ఎంపీడీఓ కె.ఎస్.కొండలరావు, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు.



పరిష్కరించిన సమస్యలను వివరిస్తున్న బిగిలీ

పాఠశాలకు రూ. 50వేల సాయం

నక్కపల్లి, న్యూస్‌టుడే: పెదబోదుగల్లం ఉన్నత పాఠశాల మరమ్మతుల నిమిత్తం పూర్వ విద్యార్థులు రూ. 50 వేల సాయం అందించారు. 1997 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు నిధులు సేకరించారు. సమకూరిన నగదులను పూర్వ విద్యార్థులు కమిడి రమణ, ఖాళీషా, ఈశ్వరరావు గ్రామపెద్దలతో కలిసి ప్రధానోపాధ్యాయుడు చోడిశెట్టి సత్యనారాయణకు అందించారు. తన వంతుగా మరో రూ. 10 వేలు ఇస్తున్నట్లు హెచ్‌ఎం ప్రకటించారు. సర్పంచి ఫాతిమున్నీషా, నాయకులు బషీర్, హుస్సేన్, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు కుమారి, ఆచార్యులు, చిన్నారావు, రమేశ్ పాల్గొన్నారు.

కోటవురట్ల, న్యూస్‌టుడే: పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. జల్లూరు, సుంకపూరు ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సత్యసాయి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కాళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు రాత పుస్తకాలు అందించారు. నాయకులు భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



దీన్‌దయాల్ చిత్రపటానికి నాయకుల నివాళి

దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి

కొత్తూరు (అనకాపల్లి), అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జన్ సంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం గ్రామాల్లో పండిట్ చిత్రపటానికి భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితర నాయకులు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎం.జగన్నాథపురం, వాడనర్సాపురం, అరబుపాలెం తదితర ప్రాంతాల్లో ఈ వేడుకలు జరిగాయి.

కొండచిలువ హల్‌చల్

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెం-నర్సీపట్నం రహదారిపై మంగళవారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. వర్షం పడుతున్న సమయంలో చెరువు గట్టు కింద నుంచి 15 అడుగుల పొడవు గల కొండచిలువ రహదారిపైకి వచ్చి వాహనాల వెలుతురు, శబ్దాలకు అక్కడే నిలిచిపోయింది. దీంతో భీతిల్లిన వాహనదారులు పెద్ద శబ్దాలు చేయడంతో జారుకుంది.

బాధ్యతను పెంచిన పదవి

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ సభ్యుడిగా నియమితమైన జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌ను కూటమి నాయకులు బుధవారం అభినందించారు. నక్కపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయం వద్దకు పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివదత్ మాట్లాడుతూ ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్లకు కృతజ్ఞతలు తెలిపారు.



శివదత్‌ను అభినందిస్తున్న నాయకులు

బకాయిలు చెల్లించాలని ధర్నా

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఎలమంచిలిలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాతజాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల కన్వీనర్ సిహెచ్.శివాజీ మాట్లాడుతూ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. వరలక్ష్మి, దేముడమ్మ, నూకరత్నం, గైరమ్మ, జ్యోతి, పద్మ కుమారి పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా అనకాపల్లిలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంగీత దర్శకుడు ఇంద్రగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ బాలు పాటలను విద్యార్థులు ఆలపించారు.

సిబ్బందికి అవగాహన అవసరం

కశింకోట, న్యూస్‌టుడే: ఇంటింటి సర్వేతో కుష్ఠురోగులను గుర్తించి వారిని ఆరోగ్యకేంద్రాలకు సిఫార్సు చేయాలని రాష్ట్ర ఎన్ఎల్ఈపీ/లెప్రసీ రాష్ట్ర సంయుక్త సంచాలకులు ఎస్.దేవసాగర్ సూచించారు. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌లు, సీహెచ్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, చికిత్సా విధానంపై అవగాహన కల్పించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఇంటింటి సర్వే నిర్వహించాలని, అనుమానిత కేసులను ఆరోగ్య కేంద్రాలకు అప్పగించాలన్నారు. రాష్ట్ర కన్సల్టెంట్ డా.డి.ప్రియదర్శిని, జిల్లా న్యూక్లియర్ వైద్యాధికారిణి సి.ధాత్రీప్రియ, రాష్ట్ర ట్రైబల్ హెల్త్ ప్రోగ్రాం మేనేజరు రమేష్‌బాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్, ఆరోగ్య బోధకులు ప్రసాద్, ఆరోగ్యవిస్తరణాధికారి వి.ఏ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాలు పట్టించుకోరా?

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సెజ్‌లో పరిశ్రమల కారణంగా నిర్వాసితులను కాలుష్య కారకాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వీటిని కాలువల్లో పారేస్తున్నా పట్టించుకోవడంలేదు. ప్రమాదం జరిగితే హడావుడి చేయడం తప్ప కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమలశాఖ, అగ్నిమాపక అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడంలేదు.



గుట్టలుగా రసాయన వ్యర్థాలు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: పాడి పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వైద్యాధికారులను కోరారు. కొత్తూరులో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాడిపశువులకు సకాలంలో వైద్య సేవలు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ శిబిరంలో 48 పశువులకు గర్భకోశ పరీక్షలు, పది లేగ దూడలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. జిల్లా పశు సంవర్ధక అధికారి డా. బి.రామ్మోహన్‌రావు, విశాఖపట్నం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డా. ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



జంపపాలెం విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎలమంచిలి గ్రామీణం, మునగపాక, న్యూస్‌టుడే: విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని జంపపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శాస్త్రి పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎలమంచిలిలో నిర్వహించిన పోటీలో నియోజకవర్గ స్థాయికి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

★గణపర్తి జడ్పీ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి బహుమతులు అందజేస్తారు. పాఠశాల హెచ్‌ఎం జయలక్ష్మి, నాయకులు కొరపాటి రాజశేఖర్, కాండ్రేగుల నాయుడు, చంద్రమోహన్, వెంకటరమణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ

అందరి కృషితో పురస్కారం

కశింకోట, న్యూస్‌టుడే: కార్మికుల, ఉద్యోగుల కృషితో పురస్కారం అందుకున్నట్లు డీజీఎం సీహెచ్.సురేష్‌కుమార్, యూనిట్ హెడ్ ఎస్.సి.కె.బాషా అన్నారు. ఏఎస్‌పేట రామ్‌కో సిమెంట్ కర్మాగారానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అవార్డు లభించింది. ఈమేరకు విశాఖలో బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎం.వి.జె. వినోద్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు.



అవార్డు అందుకుంటున్న సురేష్ కుమార్, బాషా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద వర్షం పడితే నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతోంది.
– రాఘవ, అనకాపల్లి

✓: నీరు నిల్వ ఉండకుండా కాలువ నిర్మిస్తాం. త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తాం. – చిరంజీవి, జీవీఎంసీ జోనల్ ఈఈ అనకాపల్లి

డిపాజిట్ల సేకరణలో నాగులాపల్లి ముందంజ

మునగపాక, కశింకోట, న్యూస్‌టుడే: నాగులాపల్లి పీఏసీఎస్ 2023-24 సంవత్సరంలో రూ. 35 కోట్ల లావాదేవీలు నిర్వహించి రూ. 27 లక్షల లాభం ఆర్జించిందని సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి జ్యోతీశ్వరరావు అన్నారు. నాగులాపల్లి సమావేశమందిరంలో బుధవారం సీఈఓ మళ్ల స్వామిచంద్రనాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలోఆయన మాట్లాడుతూ డిపాజిట్ల సేకరణలో సొసైటీ ముందంజలో ఉందన్నారు. సభ్యులకు 15 శాతం బోనస్ పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. 12మంది ఉత్తమ సహకార రైతులను గుర్తించి సత్కరించారు. మహిళా సంఘాలకు రుణాలు అందజేశారు. నాయకులు మళ్ల ఉమామహేశ్వరరావు, యల్లపు భాస్కరరావు, ఉల్లింగల గోవింద, బొద్దపు శ్రీరామమూర్తి, దొడ్డి సాంబశివరావు, యల్లపు వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు. చూచుకొండ పీఏసీఎస్ రూ.5.27లక్షల నికర లాభం ఆర్జించిందని సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి బి.రాజేష్‌కుమార్ తెలిపారు. సొసైటీ ఆవరణలో బుధవారం సొసైటీ కార్యదర్శి ఆడారి సోమునాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. నర్సింగబిల్లి పీఏసీఎస్ ఆవరణలో పర్సన్ ఇన్‌ఛార్జి ఏ.సుబ్రహ్మణ్యేశ్వరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.



మహిళలకు చెక్కు అందిస్తున్న సీఈఓ

శూలాల ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా మీర్‌బాబు



అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి సందర్భంగా తిమ్మరాజుపేటలో నిర్వహించే శూలాల ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా **షేక్ మీర్‌బాబు** ఎన్నికయ్యారు. తిమ్మరాజుపేటలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో ఏటా ఈ ఉత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. దీనికి ఉపాధ్యక్షులుగా రాపేటి గౌతమ్, కోశాధికారిగా మళ్ల ప్రసాద్‌తో పాటు జోగినాయుడు, గంగాధర్, సత్యనారాయణ, గంగరాజు, రాము, జగదీష్, రేవిడి జానిలను సభ్యులుగా ఎంపిక చేశారు. తొమ్మిది రోజుల పాటు వేడుకలు చేసి అక్టోబర్ 12న శూలాల ఉత్సవం నిర్వహిస్తామని ఛైర్మన్ వెల్లడించారు.

బస్సులు ఆపక ఇబ్బందులెన్నో సారూ!


గాంధీనగరం ప్రధాన రోడ్డులో బస్సులు నిలపమని చేయి అడ్డు పెడుతున్న విద్యార్థులు

నాతవరం, న్యూస్‌టుడే: గాంధీనగరం విద్యార్థులు ప్రతిరోజూ రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటలకు విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి వేచి చూస్తుండగా ఈ సమయంలో తుని వైపు నుంచి వచ్చే బస్సులు ఇక్కడ నిలపకపోవడంతో వారు ఆలస్యంగా పాఠశాలకు చేరుతున్నారు. ఇలా ప్రతిరోజూ జరుగుతుందని వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు దృష్టిసారించి గాంధీనగరం కూడలి వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

చేయిచేయి కలుపుదాం.. స్వర్ణాంధ్రను నిర్మిద్దాం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ చేతులు కలపాలంటూ ఉపాధ్యాయులు విద్యార్థులతో నినాదాలు చేయించారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం 2047 సర్వే ఫామ్‌ను ప్రధానోపాధ్యాయులు కోసూరు రాము ఉపాధ్యాయులతో నింపించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి, నారాయణరావు పాల్గొన్నారు.


నినాదాలు ఉపాధ్యాయులు, విద్యార్థులు

మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే



నర్సీపట్నం ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు అరికట్టేందుకు, గంజాయి వినియోగం గుట్టు ఛేదించేందుకు పోలీసులు నడుం కట్టారు. పట్టణ పరిధిలోని బయ్యపురెడ్డిపాలెం తోటల్లో సారా బట్టీని పోలీసులు మంగళవారం కనిపెట్టిన విషయం తెలిసిందే. ఇక్కడ 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు 3వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. పట్టణ శివార్లలో చాలామంది యువకులు రాత్రి వేళల్లో మద్యం తాగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ఎక్కడెక్కడ ఇలాంటి పరిస్థితి ఉందనేది అధికారులు అంచనాకు వచ్చారు.

★ జోగునాథునిపాలెం బైపాస్ రోడ్డులోని పలు లే-అవుట్లు, తమ్మయ్యపాలెం మార్గంలోని ఓ ప్రైవేటు స్కూల్ ప్రాంతంలో లే-అవుట్లు, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాల్లో చాలామంది రాత్రుళ్లు బహిరంగంగా మద్యం తాగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని మద్యం దుకాణాల సమీపంలోని బడ్డీల వద్ద బహిరంగంగా మద్యపానం జరుగుతోంది. ఇక నుంచి ఆకస్మిక తనిఖీల ద్వారా ఇలాంటివన్నీ కట్టడి చేయనున్నారు. జోగునాథునిపాలెం లే-అవుట్‌లో కొద్దిరోజుల క్రితం సామాజిక మాధ్యమంలో ఓ యువకుడు పెట్టిన పోస్టు దాడులకు దారి తీసింది. గంజాయి విక్రయం, వినియోగంపైనా పోలీసులు కూపీ లాగుతున్నారు. ఇప్పటికే కొంత సమాచారం పోలీసుల దృష్టికి వెళ్లింది. ఈ సమాచారం ఆధారంగా నిఘా విస్తృతం చేయనున్నారు. కొద్దిరోజుల క్రితం గంజాయిని గ్రామాల శివార్లలో పొట్లాల రూపంలో విక్రయిస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి మత్తులో ఆర్కే బాలికపై రెండేళ్ల క్రితం అత్యాచార ఘటన పట్టణంలో కలకలం రేపింది.

★ ఇటీవలి కాలంలో పట్టణంలో కొందరు యువకులు బైకులపై హంగామా సృష్టిస్తున్నారు. పెద్ద శబ్దంతో బైకులు నడుపుతూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నారు. పరిమితికి మించి బైకులపై ముగ్గురు చొప్పున ప్రయాణం చేస్తున్నారు. కళాశాలలు విడిచిపెట్టే సమయంలో వీరి ఆగడాలు మరీ శృతిమించుతున్నాయి. ఇటీవల బాధ్యతలు చేపట్టిన పోలీసులు చట్టవ్యతిరేక కార్యక్రమాలను అణిచి వేసే దిశగా ప్రత్యేకంగా దృష్టిసారించారు.

నడుం బిగించిన నర్సీపట్నం పోలీసులు


బయ్యపురెడ్డిపాలెంలో పోలీసులు గుర్తించిన సారా బట్టీ

చట్టపరమైన చర్యలు



చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిస్తాం. మైనర్లకు బైకులు ఇస్తే వాహన యజమానిపైనా కేసు నమోదు చేస్తాం. గడిచిన పది రోజుల్లోనే నర్సీపట్నం గ్రామీణ సర్కిల్ పరిధిలో ఐదు పేకాట బృందాలపై, ఆరు మద్యం గొలుసు దుకాణాలపై, మూడు చోట్ల కోడి పందాలపై కేసులు పెట్టాం. పట్టణ పరిధిలోని బయ్యపురెడ్డిపాలెంలో సారా బట్టీ గుర్తించి 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నాం. - ఎల్.రేవతమ్మ, నర్సీపట్నం, సీఐ

కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే

చోడవరం పట్టణ శివారు రామ్మోహన్ పేట అంబేడ్కర్ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. నెలల తరబడి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో నివాసితులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే కంపు ఎక్కువవుతోంది. కాలువ ఇంకుడు గుంతలా తయారవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ కాలనీ 1985లో ఏర్పాటైంది. కానీ ఇన్నేళ్లుగా మురుగు కాలువను నిర్మించకపోవడం ప్రధాన సమస్యగా మారింది. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ పనులు సక్రమంగా జరగడంలేదు. రామాలయం వెనుక తుప్పలు, డొంకలు తొలగించలేదు. రామాలయానికి, ప్రైవేటు భవనానికి మధ్యలో ఉన్న రహదారి చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. నివాసితులు రాత్రుళ్లు రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నారాయణరావు వద్ద ప్రస్తావించగా పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువల్లో పూడిక తీయిస్తామన్నారు. ఎక్కడా తుప్పలు లేకుండా చూస్తామన్నారు.


అధ్వానంగా మురుగుకాలువ


రామాలయం పక్కన పేరుకుపోయిన తుప్పలు


ఇంకుడు గుంతలా తయారైన మురుగుకాలువ

అ వీ ఇ వీ

సామాజిక తనిఖీ ప్రజావేదిక నేడు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: దేవరాపల్లి మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలు జరిగాయి. దీనికి సంబంధించి ప్రజావేదికను గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. ఉదయం 10 ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

డీవార్మింగ్ మాత్రల పంపిణీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: తురకలపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ప్రధానోపాధ్యాయుడు జాకబ్ రవీంద్ర, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

గొలుగొండ, న్యూస్‌టుడే: ముందస్తు సమాచారం మేరకు పప్పుశెట్టిపాలెం శివారు జమ్మాదేవిపేటలో బుధవారం దాడులు చేయగా దొరికిన 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామారావు తెలిపారు. గెమ్మెల రామన్నదొర, పల్లపు రాజుబాబులను అదుపులోకి తీసకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పెట్టుబడి సాయం జమచేయాలి

కె.కోటపాడు: ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతాంగానికి పెట్టుబడి సాయం రూ. 20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మండలానికి చెందిన రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు భాగ్యవతికి అందజేశారు. నాయనబాబు, ముత్యాలనాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైతు బజార్‌లో స్వచ్ఛత కార్యక్రమం

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో రైతుబజార్ ప్రాంగణంలో బుధవారం స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పారిశుద్ధ్య సిబ్బంది బజార్ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. అక్టోబర్ 2 వరకు పంచాయతీ పరిధిలో స్వచ్ఛత పనులు చేపడతామని కార్యదర్శి నారాయణరావు చెప్పారు. సచివాలయ సిబ్బంది, బండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యానికి కృషిచేసిన దీన్‌దయాల్

కె.కోటపాడు, న్యూస్‌టుడే: స్థానిక భాజపా కార్యాలయంలో బుధవారం దీన్‌దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద మండలానికి చెందిన నాయకులు జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి, పైల అమ్మాజీ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

దేవరాపల్లి: డా. బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతోపాటు దళిత వైద్యుడిపై దాడిచేసిన ఎమ్మెల్యే పంతం నానాజీని వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘ ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను నిరసిస్తూ దేవరాపల్లి వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జగన్ ప్రచారయావతో రాష్ట్రం అధోగతి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రచారయావలో పడి రాష్ట్రాన్ని అధోగతి పట్టించారని మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. మండలంలోని ఎం.అలమండ, కాశీపురం గ్రామాల్లో బుధవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తెదేపా సర్పంచులున్న పంచాయతీలకు మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు నిధులివ్వకుండా వివక్ష చూపారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వివక్షకు తావులేకుండా ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. నాసిరకం మద్యాన్ని విక్రయించిన వైకాపా ప్రభుత్వం లక్షలాది మంది ఆరోగ్యానికి ముప్పు తెచ్చిందన్నారు. అధ్వాన్నంగా ఉన్న ఎం.అలమండ ప్రధాన రోడ్డు విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ మద్యంషాపును ఖాళీ చేయకపోతే, పోలీసు బందోబస్తు పెట్టి భవనాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, మాజీ ఎంపీపీ అచ్చియ్యమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పాత్రునాయుడు, కాశీపురం సర్పంచి వరలక్ష్మి, మండలాధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సూర్యనారాయణ, ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పక్కా కాలువల నిర్మాణాలు


గౌరీపట్నంలో నివాసిత ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: గౌరీపట్నంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తానని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గౌరీపట్నంలో ఆయన పర్యటించి స్టిక్కర్లను అంటించారు. మురుగునీరు నిలిచిపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే పక్కా కాలువల నిర్మాణాలు జరిగేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సాగునీరు అందించే గ్రోయిన్ పనులు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. సర్పంచి లక్ష్మీచంద్రరావు గ్రామంలో రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఎంపీటీసీ సభ్యులు మంగా జగన్నాథం, ఉప సర్పంచి కోన శ్రీను, ఎంపీడీఓ ఆంజనేయులు, ఇంజినీరింగ్ అధికారి శాంతారాం పాల్గొన్నారు. చోడవరంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెదేపా మండలాధ్యక్షుడు గంగాధర్ తెలిపారు.

సాంకేతిక విధానంతో మేలైన దిగుబడి


పొలంలో వరిని పరిశీలిస్తున్న అధికారులు

కృష్ణదేవిపేట, కె.కోటపాడు, న్యూస్‌టుడే: పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సిఫార్సులు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి సూచించారు. కొత్తమల్లంపేటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించాలంటే సాంకేతిక విధానాలు ఆచరించాలని పేర్కొన్నారు. చౌడువాడలో ఏఓ సోమశేఖర్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

రావికమతం, గొలుగొండ, చీడికాడ, మాడుగుల గ్రామీణం: రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి రూప చెప్పారు. కొత్తకోట, కన్నంపేటలో పశువుల టీకాలు, మందులు గురించి పశువైద్యాధికారిణి డాక్టర్ బాలతేజ రైతులకు వివరించారు. సర్పంచులు లోవరాజు, సత్యవతి, నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి పాల్గొన్నారు. కొత్తఎల్లవరం రైతు సేవాకేంద్రంలో యూరియా అందుబాటులోకి వచ్చిందని వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. చీడికాడ మండలం అర్జునగిరి, జి.కొత్తపల్లిలో, ఏఓ రమాదేవి, పెదగోగాడ పశువైద్యాధికారి రాఘవమ్మ, సర్పంచులు సూరినాయుడు, రమాదేవి, అర్జునగిరి ఎంపీటీసీ సభ్యుడు అమ్మతల్లినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. అధిక దిగుబడులే సాధించాలంటే శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని కొండెంపూడి కృషి విజ్ఞానకేంద్ర శాస్త్రవేత్త రాజ్‌కుమార్ అన్నారు. నర్సీపట్నం వ్యవసాయ సహాయసంచాలకులు టి.శ్రీదేవి, ఏఓ వాసుదేవరావు పాల్గొన్నారు.


కన్నంపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇరుకు గదులు.. రోగుల అవస్థలు

రావికమతం, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ మేడివాడలో ఆరోగ్య ఉప కేంద్రం అద్దె ఇంట్లో నడుస్తోంది. గదులు ఇరుకుగా ఉండటంతో వైద్యం కోసం వచ్చే రోగులు కూర్చునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది వరండాలోనే సేవలందిస్తున్నారు. మేడివాడ కేంద్రంగా అప్పలమ్మపాలెం, గర్నికం, దిడ్డి, బాదనపాడు, పి.పొన్నవోలు, జి.చీడిపల్లి, కుముందానిపేట, గొల్లలపాలెం తదితర గ్రామాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు గతంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో భవనం నిర్మించినా.. వినియోగంలోకి రాకుండానే శిథిలమైంది. విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎన్నికలకు ముందు హడావిడిగా ప్రారంభించారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు ఈ భవనాన్ని వైద్యారోగ్య శాఖకు అప్పగించలేదు. సమస్యను సర్పంచి వజ్రపు లీలాశివ మండల పరిషత్తు సమావేశంలో ప్రస్తావించినా.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేదు. ఎమ్మెల్యే రాజు దృష్టిసారించి విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


అద్దె ఇంట్లో ఆరోగ్య ఉపకేంద్రం


వినియోగంలోకి రాని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ఉపాధి కల్పించాలంటూ కళాకారుల విజ్ఞప్తి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను కళాజాతాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లే అవకాశం జిల్లాలోని కళాకారులకే అప్పగించాలని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార కళాకారుల సంఘం అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడును కోరారు. పలువురు కళాకారులతో కలిసి ఆయన బుధవారం ఇక్కడ అయ్యన్నకు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఉమ్మడి విశాఖతో సంబంధం లేకుండా ఇతర జిల్లాల వారికి అవకాశం ఇవ్వడం వల్ల స్థానికులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. తెదేపా అధికారంలో ఉన్నప్పుడు 2017-18 సంవత్సరాల్లో గ్రామదర్శిని, జన్మభూమి సభల్లో కళా ప్రదర్శనలు ఇచ్చినందుకు రూ. 36 లక్షలు బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధులొచ్చేలా చూడాలని కోరారు. కళాకారుల విజ్ఞాపన సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అయ్యన్న హామీ ఇచ్చారు.


అయ్యన్నకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

నారా లోకేశ్‌ను కలిసిన నాయకులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం విశాఖలో తెదేపా మండలాధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు బొడ్డు అక్కునాయుడు, పూడి శ్రీనివాసరావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.



గంగమ్మ ఒడికి గణనాథుడు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: ఒమ్మలిలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. డీజే, తీన్‌మార్, కోబ్రా డాన్స్‌లు, కోలాటం, నేలవేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ ఘనంగా ఊరేగింపు చేశారు. అనంతరం గొర్రిగెడ్డలో నిమజ్జనం చేశారు.


ఊరేగింపులో గణనాథుడు

ట్రాన్స్‌కో ఏఈగా నవీన్‌కుమార్

రోలుగుంట: మండల ట్రాన్స్‌కో ఏఈగా నవీన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. రెండేళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లా నుంచి రోలుగుంట ఏఈగా బాధ్యతలు చేపట్టిన పద్మనాభాన్ని ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా విశాఖ నగర పరిధి సింహాచలానికి బదిలీచేశారు. ఆయన స్థానంలో నవీన్‌కుమార్‌ను ఏఈగా నియమించారు.

ఆలయ పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో రోడ్డు ముందుకు వచ్చిన దుకాణాల ఆక్రమణలను బుధవారం మున్సిపల్ అధికారులు, పోలీసులు ఆధ్వర్యంలో తొలగించారు. అక్టోబరు 3 నుంచి ఈ ఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఈ చర్యలు చేపట్టారు. బలిఘట్టం బైపాస్‌రోడ్డులోని గోతులను తాత్కాలికంగా పూడ్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పర్యవేక్షించారు.


రోడ్డు ముందుకు వచ్చిన ఆక్రమణలు పరిశీలిస్తున్న సీఐ రేవతమ్మ, కమిషనర్ సురేంద్ర తదితరులు

వాయిద్య కళాకారుల పోస్టులు భర్తీ చేయాలి

చోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాల్లో ఖాళీలుగా ఉన్న డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర వాయిద్యాల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అఖిల భారత నాయీబ్రాహ్మణ వాయిద్య కళాకారుల జేఏసీ అధ్యక్షులు రాయవరపు నానాజీ ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడలో దేవాదాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. 2008లో 460 పోస్టులు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భర్తీ చేశారన్నారు. 2016లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు హయాంలో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఆనాటి నుంచి వాయిద్య కళాకారుల పోస్టుల భర్తీ జరగలేదని పేర్కొన్నారు. ధ్రువపత్రాలు కలిగిన వాయిద్య కళాకారులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన కోరారు. దేవాదాయశాఖ మంత్రి ఆనంను కలవనున్నట్లు నానాజీ తెలిపారు.

తాగునీరు వృథా.. పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ప్రజలకు అందాల్సిన తాగునీరు వృథా అవుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొండల అగ్రహారం కూడలి సమీపంలో ఉన్న మంచినీటి పథకం నింపేందుకు బుధవారం మోటారు ఆన్‌చేసి వదిలేశారు. ట్యాంకు నిండినా మోటారును ఆఫ్ చేయకపోవడంతో ప్రజలకు అందాల్సిన నీరు వృథా అయింది. తరచూ ఇలానే జరుగుతోందని స్థానికులు అంటున్నారు.


కొండల అగ్రహారంలో..

అధికారుల బాధ్యతల స్వీకరణ


రామారావు ఎంఆర్‌పీ బాబు సువర్ణరాజు

చోడవరం, నర్సీపట్నం, న్యూస్‌టుడే: చోడవరం తహసీల్దారుగా ఎ.రామారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాష్ట్ర సచివాలయం నుంచి ఇక్కడకు వచ్చారు. మండల పరిషత్ అభివృద్ధికారిగా పీవీఎస్ఎన్ ఆంజనేయులు బాడంగి నుంచి ఇక్కడకు జిల్లా బదిలీలో వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు గతంలో ఇక్కడ పంచాయతీ కార్యనిర్వహణాధికారిగా, ఈఓపీఆర్‌డీగా పనిచేశారు. నర్సీపట్నం డివిజన్ సర్వే విభాగం ఇన్‌స్పెక్టర్‌గా ఎంఆర్‌పీ బాబు నియమితులయ్యారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి కొత్తగా కేటాయించిన పోస్టు ఇది. ఈయన ఇక్కడ గతంలో సర్వే విభాగం ఉపపరిశీలకుడిగా పనిచేశారు. నర్సాపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. స్థానిక ఉపపరిశీలకుడుగా చేసిన వెంకటరమణను విశాఖపట్నం ఆర్డీఓ కార్యాలయంలో క్లస్టర్-2కు బదిలీ చేశారు. ఈయన స్థానంలో పాడేరు నుంచి కృష్ణమోహన్‌ను నియమించారు.

దేవరాపల్లి, బుచ్చెయ్యపేట: దేవరాపల్లి ఎంపీడీఓగా ఎం.వి.సువర్ణరాజు బాధ్యతలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట నుంచి ఇక్కడకు సాధారణ బదిలీపై వచ్చారు. బుచ్చెయ్యపేట ఎంపీడీఓగా వి.విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పలు గ్రామాలకు చెందిన సర్పంచులు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. గతంలో కొన్నాళ్లపాటు ఈమె ఇక్కడ పనిచేశారు. మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఏబీసీ కార్టూన్ల పుస్తక ఆవిష్కరణ

నాతవరం, న్యూస్‌టుడే: వెంకయ్యపాలెం ఉపాధ్యాయులు అంబటి చంటిబాబు కార్టూనిస్టుగా దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకోవడం తమకు ఆనందదాయకమని మండల విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ, కె.వరహాలబాబు పేర్కొన్నారు. బుధవారం విద్యాశాఖ కార్యాలయంలో అంబటి చేతుల్లో నుంచి జాలువారిన ఏబీసీ కార్టూన్ల పుస్తకాన్ని వీరు ఆవిష్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన చంటిబాబు కార్టూన్లో విజ్ఞానం, వినోదం, ఆలోచన కలిగించే విషయాలు పొందుపరిచారని కొనియాడారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు

విధి నిర్వహణలో రాజీ పడకుండా సేవలు

గొలుగొండ, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రుత్తల రామకృష్ణ పదవీ విరమణ పొందే వరకు విద్యార్థులకు అనేక సేవలు అందించారని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో రాజీ పడకుండా పిల్లలకు చక్కని ఆహారంతోపాటు క్రమశిక్షణతో కూడిన చదువులు అందించారని సాంఘిక సంక్షేమ గురుకులాల ఉమ్మడి జిల్లాల సమన్వయాధికారి రూపవతి అన్నారు. అనంతరం రామకృష్ణ, రాజేశ్వరి దంపతులను పీఆర్టీయూ నేత గోపీనాథ్, ఎంఈఓ సత్యనారాయణ, చింతకాయల రాజేష్‌తోపాటు ప్రస్తుత ప్రిన్సిపల్ కోటేశ్వరరావు తదితరులు శాలువాలు కప్పి సన్మానించారు.

మాడుగుల: మాడుగులలో ఆ రోజుల్లో పేదలకు ఉచిత వైద్యం అందించిన పట్టా వీర్రాజును ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా సత్కరించారు.

వర్షాలకు జేపీ అగ్రహారం రోడ్డు ధ్వంసం

రోలుగుంట, న్యూస్‌టుడే: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రహదారులు కుంగిపోతున్నాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని జేపీ అగ్రహారం నుంచి నర్సీపట్నం మండలం సుబ్బారాయుడిపాలెం వెళ్లే తారురోడ్డే ఇందుకు నిదర్శనం. జేపీ అగ్రహారానికి సమీపంలో తారురోడ్డు నిర్మాణ సమయంలో ఏర్పాటుచేసిన మట్టి ఇటీవల వర్షపునీటికి కరిగిపోవడంతో రోడ్డు ఒక్కసారిగా ధ్వంసమైంది.


కుంగిన రోడ్డు వద్ద స్థానికుల రక్షణ ఏర్పాట్లు

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - మత్తువదలరా-2
స్క్రీన్-2 - గొర్రె పురాణం

'నిజ నిర్ధారణ కమిటీ వేయాలి'

ఉక్కునగరం: ఉక్కు కర్మాగారం 'ఎస్ఎంఎస్-1 ఎల్పీ బే'లో మంగళవారం జరిగిన ప్రమాద ఘటనపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని ఇంటక్ నాయకులు మంత్రి రాజశేఖర్, పి.వి.రమణమూర్తి, సిటూ ఎస్ఎంఎస్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ లిక్విడ్ స్టీల్‌లో కలిపే మిశ్రమ పదార్థాలు నాసిరకంగా ఉండడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. సంబంధిత విభాగం హెచ్ఓడీ బాలకుమార్ స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో కార్మిక నాయకులు శాంతించారు.

పెందుర్తి

– న్యూస్‌టుడే, పెందుర్తి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ పీఎఫ్ కాలనీలో 1బి/1/1, పాత గ్రామంలో 1ఎ/బి/1 స్తంభాలకు ఉన్న వీధి దీపాలు గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. కాలనీవాసులు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు.
– సీహెచ్.అప్పలరాజు, పీఎఫ్ కాలనీ

సమాధానం: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– శివ రామ్‌ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

అ వీ ఇ వీ

■ మంత్రి లోకేశ్‌కు అపూర్వ స్వాగతం

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: విశాఖ పర్యటనలో భాగంగా తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ బుధవారం ఉదయం 8:30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయనకు రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం లోకేశ్ ప్రత్యేక వాహన శ్రేణిలో నగరంలోకి వెళ్లారు.

■ పరవాడ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ఎంపీడీవోగా ఎస్.డి.శ్యామ్‌సుందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చోడవరం ఎంపీడీవోగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరించి మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వి.హేమసుందరరావు చీడికాడ మండలం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

■ నేడు దేవీపురం ఆలయ వ్యవస్థాపకుడి జయంతి వేడుకలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురంలోని శ్రీచక్ర ఆలయ వ్యవస్థాపకులు అమృతానంద స్వామి 90వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద విశేష కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు గణపతి, బాల వారాహి పూజలు జరుపుతామన్నారు. 10 నుంచి ఒంటిగంట వరకు యంత్ర పూజలు, అనంతరం అన్నదానం, సాయంత్రం గురుపాదుకా పల్లకీ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

■ మహాధర్నా విజయవంతానికి పిలుపు


విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం 25 వేలు చేయాలని డిమాండ్లతో ఈనెల 30న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించనున్న మహాధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. జూపార్కు గేటు వద్ద బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. కార్మికులంతా ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నరేంద్రకుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

■ ఇంటర్వ్యూలకు 44 మంది హాజరు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారం అధికారులను డిప్యుటేషన్‌పై ఎన్ఎండీసీ అనుబంధ నగర్‌నార్ ఉక్కు కర్మాగారానికి పంపేందుకు మూడు రోజులుగా నిర్వహించిన ఇంటర్వ్యూలకు కేవలం 44 మందే హాజరయ్యారు. ఈ ప్రక్రియకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వుల్లో అనేక అంశాలపై పూర్తిస్థాయి స్పష్టత లేకపోవడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపలేదు.

మేమూ ఎల్‌జీ పాలిమర్స్ బాధితులమే..!

సహాయం అందించాలని కోరుతున్న నివాసితులు


బంటాకాలనీ కొండపై నివాసాలు

వేపగుంట, న్యూస్‌టుడే

ఎల్‌జీ పాలిమర్స్ కంపెనీ గ్యాస్ లీకేజీ బాధితుల్లో తాము ఉన్నామని, తగిన న్యాయం చేయాలని జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీ, 94వ వార్డు వెంకటసాయి నగర్, అప్పలనర్సయ్యకాలనీ, కృష్ణానగర్ పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. కంపెనీకి దగ్గరగా ఉన్న కొండవాలు ప్రాంతాలు ఇవేనని ఎత్తులో ఉండటంతో గాలి ఉత్తరం వైపు వీయడంతో తమ కాలనీల్లో ఉన్న తామంతా ఉక్కిరిబిక్కిరికి గురయ్యామన్నారు. కొంతమంది ఎవరికి వారుగా ఆసుపత్రుల్లో చేరి చికిత్స చేయించుకున్నారని చెబుతున్నారు. మా కాలనీల్లోని ప్రజలు ఎలా ఉన్నారన్న విషయాన్ని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రెండో విడత రూ.60 కోట్ల నష్ట పరిహారం కొన్ని కాలనీవాసులకు ప్రభుత్వం అందజేసి సహకరించింది. కొండవాలు ప్రాంతాల కాలనీల్లో ఎంత మంది గ్యాస్ లీకేజీ కారణంగా అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది విచారణ చేసి తగున్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. దుర్ఘటన జరిగిన సమయంలో వెలువడిన విషవాయువును పీల్చి కొంతమంది మంచాన పడ్డారన్నారు. ఈ కాలనీల్లో రాజకీయ నాయకులు, వారి అనుచరులకు నష్ట పరిహారం వచ్చేలా చేసుకున్నారని ఆరోపించారు. ఇటీవల కృష్ణానగర్ పరిసర కాలనీవాసులు సమావేశమై ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కలెక్టరుతో చర్చిస్తానని ఎమ్మెల్యే కాలనీవాసులకు తెలిపారు. సంఘటన జరిగినప్పుడు కృష్ణానగర్ పరిసర ప్రాంతాల్లో కొందరిని బాధితులుగా గుర్తించినప్పటికీ వారికి ఎటువంటి సహాయం అందలేదని వారు అంటున్నారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి


బంగారమ్మపాలెంలో వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న అధికారులు, రైతులు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు అన్నారు. సబ్బవరం మండలం బంగారమ్మపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు అవగాహన కల్పించారు. విచక్షణా రహితంగా ఎరువులు వాడటం, కలుపు నివారణ చేపట్టకపోవడం వల్ల పురుగులు వృద్ధి చెంది దిగుబడి తగ్గిపోతుందన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ రైతులకు మంచి పథకాలతోపాటు రాయితీలు ప్రభుత్వం ఇస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ అధికారిణి స్వర్ణలత మాట్లాడుతూ పశువులకు నూతనంగా వచ్చిన టీకాలు అందరూ వేయించాలన్నారు. పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, గ్రామ ఉద్యాన సహాయకులు పి.అపర్ణ, శరగడం రాము, మళ్ల శ్రీను, నేతలు దాడి కన్నంనాయుడు, రాపేటి రాము, పి.రామకోటి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం


అంధులకు అన్నదానం చేస్తున్న ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

వేపగుంట, న్యూస్‌టుడే: నగరంలోని వైశాఖి దివ్యాంగ విద్యార్థి సేవా ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు చీమలాపల్లి హెల్ప్‌అండ్ హెల్ప్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆశ్రమ పాఠశాల, ఎంఈఎస్ కాలనీలోని పయనీర్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ పాఠశాలల్లోని అంధ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం, నిత్యావసరాలను బుధవారం అందజేశారు. ట్రస్టు 15వ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, కార్యదర్శి సోమేశ్వరరావు, విరాళ దాత ఎన్.లక్ష్మీనారాయణ దంపతులు, పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన


సబ్‌స్టేషన్ కూడలిలో విద్యార్థులతో సమావేశమైన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ హారణి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో బస్‌షెల్టర్ నిర్మాణానికి అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. ఇక్కడ షెల్టర్ లేని కారణంగా విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కార ఫిర్యాదు వేదికలో భాగంగా ఈనెల 23న స్థానిక యువకులు అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేసి షెల్టర్ లేకపోవడం వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ హారణి సబ్‌స్టేషన్ కూడలికి చేరుకుని విద్యార్థులు, ప్రయాణికులతో మాట్లాడారు. అనంతరం బస్‌షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. వర్రి చంద్రశేఖర్, పైలా చినఅక్కునాయుడు, బండారు చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన మురుగు తొలగింపు

వేపగుంట, న్యూస్‌టుడే

ఈనాడు కథనానికి స్పందన

భారీ వర్షాలకు భూగర్భ డ్రైనేజీ సంపులు పొంగి పొర్లడంతో పలు కాలనీవాసులు నానాఅవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై 'మ్యాన్‌హోల్ పొంగి... దారులు మునిగి' శీర్షికతో ఈనెల 25న బుధవారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి జోన్-8 జెడ్సీ హేమవతి స్పందించారు. సంబంధిత విభాగం అధికారులతో మాట్లాడి పురుషోత్తపురం కాలనీలో సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. యూజీడీ సిబ్బంది పేరుకుపోయిన మురుగును ట్యాంకర్ల సహాయంతో తొలగించారు.


సంపులోని మురుగును తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, గ్రామస్థులు

సబ్బవరం, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు తరచూ రక్తహీనతతో బాధపడుతుంటారని పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అరికట్టవచ్చునని ఏఎన్ఎం జయ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సబ్బవరం మండలం మొగలిపురం అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. సర్పంచి గండి అరుణ, ఎంపీటీసీ సభ్యురాలు టి.సన్యాసమ్మ, బంగారునాయుడు, వార్డు సభ్యులు అంటి నానాజీ, తమరాన సత్యనారాయణ, బైలపూడి రాంబాబు, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చైతన్యంతోనే మత్తు పదార్థాల నియంత్రణ

పెందుర్తి, న్యూస్‌టుడే: యువతలో చైతన్యం నింపడం ద్వారానే మత్తు పదార్థాల వినియోగం, నియంత్రణ సాధ్యమవుతుందని ఉమ్మడి విశాఖ జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సహాయ సంచాలకుడు ఎస్.విజయకుమార్ అన్నారు. పెందుర్తి ప్రాంత కెమిస్ట్, డ్రగ్గిస్ట్ సంక్షేమ సొసైటీ సమన్వయంతో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మత్తు మందులు, మత్తు పదార్థాల వినియోగం, ప్రభావాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కె.కల్యాణి, వి.అభిప్రియ, ఎం.శ్రీనివాసరావు, ఎన్.కల్యాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు; సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

సచివాలయం చుట్టూ ముళ్లపొదలే..!

వేపగుంట, న్యూస్‌టుడే

జీవీఎంసీ 95వ వార్డు చీమలపల్లి సచివాలయం చుట్టూ ముళ్ల పొదలు ఉండటంతో సచివాలయానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ భవనం పల్లపు ప్రాంతంలో ఉండటంతో వర్షం పడితే ప్రాంగణమంతా బురదమయమై రాకపోకలకు ఉద్యోగులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు ఇక్కడ ముళ్ల పొదలను పూర్తిగా తొలగించి పల్లపు ప్రాంతంలో మట్టి వేయించి రాకపోకలకు అనువుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.


చీమలాపల్లి సచివాలయం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. వాడచీపురుపల్లిలో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వం 100 రోజుల్లో చేసిన, మున్ముందు చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, నియోజకవర్గ భాజపా సమన్వయకర్త గొర్లె రామునాయుడు, సర్పంచి శివలంక లక్ష్మి, ఉప సర్పంచి కూండ్రపు శ్రీను, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంట, న్యూస్‌టుడే: సాయిమాధవనగర్, లక్ష్మీనరసింహనగర్ కాలనీల్లో కూటమి నేతలు మామిడి దుర్గాప్రసాదు, బంటు సురేశ్, నొల్ల అప్పలరాజు, చొప్పా వెంకటరావు, సచివాలయ కార్యదర్శులు హజరత్ ఇబ్రహీం తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలకు కరపత్రాలను అందజేశారు.


సాయిమాధవనగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న కూటమి నాయకులు, సచివాలయ కార్యదర్శులు

వాడచీపురుపల్లి(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


దేశపాత్రునిపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

మరుగుదొడ్డిలో నాగజెర్రి కలకలం


పామును పట్టుకున్న స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి రొక్కం కిరణ్

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ప్రధాన రహదారిలోని ఓ దుకాణం మరుగుదొడ్డిలో బుధవారం పాము కలకలం రేపింది. యాజమాన్యం సమాచారం మేరకు నగరానికి చెందిన స్నేక్ సేవర్ సొసైటీ ప్రతినిధి రొక్కం కిరణ్‌కుమార్ పామును చాకచక్యంగా పట్టుకున్నారు. నాగజెర్రి జాతికి చెందిన ఈ పాము సుమారు 8 అడుగుల పొడవు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. సురక్షిత ప్రాంతంలో దీన్ని విడిచిపెడతానని ఆయన తెలిపారు.

పగటి వెలుగులు ఆగేదెన్నడో..?


వెలుగుతున్న హైమాస్ట్ దీపం

వేపగుంట, న్యూస్‌టుడే

జీవీఎంసీ 95వవార్డు వరలక్ష్మీనగర్‌లోని వీధి దీపాలు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్తు వృథా అవుతోంది. ఇక్కడ హైమాస్ట్ దీపాలతో పాటు వీధి దీపాలు కూడా నిరంతరం వెలుగుతున్నాయి. దీనివల్ల దీపాలు తొందరగా మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్పణం

నేడు ఎమ్మెల్యే పర్యటన

వేపగుంట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు వేపగుంటలో గురువారం పర్యటించనున్నారు. వేపగుంట కూడలిలో గల వినాయక గుడి వెనుక గల జీవీఎంసీ సామాజిక భవనంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొంటారని వార్డు జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి తెలిపారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు

రాజమహేంద్రవరం నేరవార్తలు: గత నెలలో భారీ చోరీచేసి తిరుగుతున్న అంతర్రాష్ట్ర నేరస్తుడ్ని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ రాజమహేంద్రవరంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా జగన్నాథపురం ఏటిమొగకి చెందిన పి.రవిశంకర్ అలియాస్ వీరబాబు పశ్చిమగోదావరి జిల్లాలో 22, విశాఖలో 16, తూర్పుగోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరంలో ఒకటి, అనకాపల్లిలో ఒకటి మొత్తం 44 చోరీ కేసుల్లో నేరస్తుడు. గతనెల 26 రాత్రి కొవ్వూరు పట్టణంలోని ఓ అపార్టుమెంట్‌లోకి చొరబడి సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం చోరీ చేశాడు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తు చేపట్టారు. ఇటీవల కొవ్వూరులోని నిడదవోలు బస్టాపులో నిందితుడు వీరబాబు, అతడికి సహకరించిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశారు.

పరవాడలో భారీ వాన | పైడమ్మబంద చెరువుకు గండి


పరవాడలో పైడమ్మబందకు పడిన గండి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సమారు రెండు గంటల పాటు ఏకధాటిగా కురవడంతో పైడమ్మబంద గట్టుకు గండి పడింది. అందులోని నీరంతా పక్కనే ఉన్న పెద్దచెరువులోకి ప్రవహించింది. పైడమ్మబందను బుధవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు పరిశీలించారు. గండిని వెంటనే పూడ్చాలని ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణను ఆదేశించారు. పరవాడ ఎస్సీ వీధిలోకి పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. నూకాలమ్మ తల్లి ఆలయ సమీపంలో విద్యుత్తు స్తంభం దెబ్బతిని కూలిపోయింది. ఏపీఈపీడీసీఎల్ ఏఈ శేషసాయి ఆధ్వర్యంలో సిబ్బంది కొత్త స్తంభం ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు. కొండల నుంచి పెద్దఎత్తున వరద ప్రవహించడంతో పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ యూనిట్-5 ప్రహరీ సుమారు 50 మీటర్ల మేర కూలిపోయింది. పరవాడ మండలంలో 126 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల వ్యవసాయాధికారిణి చంద్రావతి తెలిపారు.


కూలిన మెట్రోకెమ్ ఫార్మా పరిశ్రమ ప్రహరీ


పరవాడ ఎస్సీ వీధిలోకి చేరిన వరద

ఈ దారిలో ప్రయాణం బిక్కుబిక్కు..


రహదారి వైపు పెరిగిపోతున్న చెట్ల కొమ్మలు

పరవాడ, న్యూస్‌టుడే

మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ప్రయాణం చేయాలంటే ఇక్కట్లు తప్పడం లేదు. వాహనచోదకులు, పాదచారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఇటీవల వాహనాల రద్దీ పెరిగింది. ముఖ్యంగా పరవాడ, భరణికం, వెంకటాపురం, సిరసపల్లి, తోటాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులతో పాటు విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. వెంకటాపురంలోని క్లాసిల్ కంపెనీకి చెందిన ట్రాలర్, కంటైనర్ లారీలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి ఇరుగ్గా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవడానికి మార్గం సరిపోక వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.


రోడ్డును మూసేస్తున్న చెట్ల కొమ్మలు

ఒకపక్క రహదారి ఇరుకు.. మరోపక్క ఇరువైపులా చెట్ల కొమ్మలు రోడ్డును మూసేస్తున్నాయి. రహదారిలో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఇవి దగ్గరికి వచ్చేవరకు వాహనదారులకు కనరావడం లేదు. అధికారులు రోడ్డును నిర్మించి బెర్ములు మాత్రం వేయలేదు. దీంతో పలుచోట్ల రోడ్డు అంచులు ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ప్రయాణించినా, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో రహదారి కిందకు దిగితే భారీ మూల్యం ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రక్షణ గోడ లేని కల్వర్టు

రాత్రయితే అంధకారం..

రహదారిలో రాత్రుళ్లు అంధకారం నెలకొంటోంది. స్తంభాలకు విద్యుత్తు దీపాలు లేని కారణంగా రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు, పాదచారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఓయస్టర్ పాఠశాల సమీపంలోని కల్వర్టు రక్షణ గోడ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పునర్నిర్మాణం చేపట్టలేదు. దీంతో అక్కడ ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా బెర్ములు